సాక్షి నంద్యాల

బుధవారం : 30 : ఏప్రిల్ : 2025



ధగధగల వెనుక దగా!

అక్షయ తృతీయ వచ్చేసింది. పసిడి కొనుగోలు సమయంలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోవాల్సిందే. అథరైజ్డ్ బిల్లులు తీసుకుంటే మేలిమి బంగారం మీదే అవుతుంది. 8లో▸



చెరువులో మట్టి దోపిడీ

కూటమి నాయకులు ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. అక్కజమ్మ చెరువులో జేసీబీలతో మట్టిని తవ్వి వాహనాల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 8లో▸



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై మంగళవారం ప్రకాశం జిల్లాకు చెందిన రెయిన్ నృత్య అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

చౌడేశ్వరిదేవి హుండీ ఆదాయం రూ.19.84 లక్షలు



హుండీ కానుకలు లెక్కింపు చేస్తున్న దృశ్యం

బనగానపల్లె: నందవరంలో వెలిసిన చౌడేశ్వరి దేవికి హుండీ ఆదాయం రూ. రూ.19.84 లక్షలు వచ్చింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ ప్రాంగణంలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. ఈ ఏడాది మార్చి 11 నుంచి ఏప్రిల్ 29వ తేదీ వరకు వచ్చిన కానుకలు లెక్కించగా రూ.19,84,785లు లభించింది. అలాగే 48.200 గ్రాముల బంగారం, 3.150 కేజీల వెండి వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీ అధికారి భరత్, ఆలయ అర్చకులు, నంద్యాల బాలాజీ సేవా సమితి సంఘం వారు పాల్గొన్నారు. అలాగే మంగళవారం నిర్వహించాల్సిన తలనీలాల సేకరణ, చెప్పుల స్టాండ్ వేలంపాట మే 2వ తేదీకి వాయిదా పడినట్లు ఆలయ అధికారులు వివరించారు. ఈ పాటలో వేలంపాటదారులు ఎవరు డిపాజిట్ చెల్లించుటకు ముందుకు రాక పోవడంతో వాయిదా వేశామన్నారు.

సమస్యను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు!



ఎంపీ బైరెడ్డి శబరికి సమస్యను వివరిస్తున్న రుద్రవరం గ్రామస్తులు


పాములపాడు: నేషనల్ హైవే నిర్మాణంలో చోటు చేసుకుంటున్న లోపాలను ప్రశ్నిస్తే సామాన్యులపై కంపెనీ అధికారులు కేసులు నమోదు చేయిస్తున్నారని మాజీ సర్పంచు రామసుబ్బయ్య, గ్రామస్తులు ఎంపీ బైరెడ్డి శబరితో మొరపెట్టుకున్నారు. మంగళవారం రుద్రవరం మీదుగా వెళ్తున్న ఎంపీని గ్రామస్తులు అడ్డుకుని సమస్యలను ఏకరువు పెట్టారు. నేషనల్ హైవే 340సీ నిర్మాణంలో భాగంగా చేపట్టిన అండర్‌పాస్ వంతెనకు అలైన్‌మెంటు ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా ఒకే వైపు స్థలాలు తీసుకుంటున్నారని వాపోయారు. అండర్ పాస్ వంతెనకు ఇరువైపులా 7 మీటర్ల సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఓ వైపు ఒక్క మీటరు వెడల్పు మాత్రమే ఉంటే రాకపోకలు సాగేదెలా అని ప్రశ్నించారు. సమస్యపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్ నాయుడు, బీఎస్ఎన్ఎల్ జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యుడు రమేష్ తదితరులు ఉన్నారు.

పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించండి

గోస్పాడు: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు 46 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ పోర్టల్ కింద 43 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తూ ఆమోదం తెలిపామన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్, తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 29 యూనిట్లకు మొత్తం 4.50 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాలు మంజూరు చేశామన్నారు. స్కిల్ కాలేజ్ ట్రైనింగ్స్, జాబ్ మేళాలు, ఇండస్ట్రియల్‌లో వివిధ ట్రైనింగ్‌ల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఎల్‌డీఎం రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామి ఉరుసు ప్రారంభం

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన కౌతాళం జగద్గురు ఖాదర్‌లింగ స్వామి 321వ ఉరుసు మంగళవారం నుంచి ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా రాత్రి దర్గాలో ధర్మకర్త ఇంటి నుంచి వచ్చిన గంధంతో ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. ఉరుసులో భాగంగా వచ్చే నెల 9న శుక్రవారం స్వామి వారి సమాధిని శుభ్రచేయడం, 10న గంధం, 11న ఆదివారం ఉరుసు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12న (సఫ్‌రాలూట్‌నా) స్వామి ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.



బండిఆత్మకూరులో ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న దృశ్యం

వరించని మద్దతు!

పతనమైన వరి ధాన్యం ధరలు

- ఉమ్మడి జిల్లాలో చురుగ్గా కోతలు
- రబీ ధాన్యం నాణ్యత బాగున్నా ధర అధ్వానం
- మార్కెట్‌లో లభిస్తున్న ధర రూ.1,600 నుంచి రూ.1800 వరకే
- గత ఏడాది క్వింటా ధాన్యం ధర రూ.2800
- ఎకరాకు రూ.30 వేల వరకు నష్టపోతున్న రైతులు



యంత్రం ద్వారా వరికోతలు

కర్నూలు(అగ్రికల్చర్): ధాన్యం రైతును కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు కష్టించి పండించిన రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. పండించిన ధాన్యాన్ని కొనేవారు కరువయ్యారు. మార్కెట్‌లో బియ్యం ధరలు షాక్ కొడుతున్నా.. రైతులకు మాత్రం గిట్టుబాటు ధర లభించని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే రైతుల కష్టాలు, నష్టాలతో మాకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రబీలో పండించిన ధాన్యం నాణ్యత ఉన్నప్పటికీ కనీస మద్దతు ధర లభించక రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎన్నికల సమయంలో రైతులపై అపారమైన ప్రేమ కనబరిచిన నారా చంద్రబాబు నాయుడు నేడు రైతుల కష్ట నష్టాలతో సంబంధం లేదనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

మద్దతు ధర రూ.2,320.. దళారీలు ఇస్తున్న ధర రూ.1600 నుంచి రూ.1800

ధాన్యం రైతు బాగుండాలంటే క్వింటాకు కనీసం రూ.3వేల వరకు ధర ఉండాలి. దీనినే గిట్టుబాటు ధరగా వ్యవహరిస్తారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి కేంద్రం ఏ–గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధర రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,300 ఉంది. ఈ ప్రకారం ధర ఉన్నా రైతులకు ఊరట లభిస్తుంది. నేడు మద్దతు ధర కాదు కదా క్వింటా ధర రూ.1,600 నుంచి రూ.1,800 వరకు మాత్రమే పలుకుతోంది. 2023–24 ఖరీఫ్, రబీ సీజన్‌లలో పండించిన ధాన్యం ధర రూ.2,800 నుంచి రూ.3వేల వరకు ఉంది. గత ఏడాదితో పోలిస్తే నేడు రైతులు క్వింటాపై రూ.1000 పైగా నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సన్న రకాలైన కర్నూలు సోన, నంద్యాల సోనా రకాలను సాగు చేస్తారు. రబీలో ఆర్ఎన్ఆర్ రకాలు సాగవుతాయి. ఈ రకాన్నే షుగర్‌లెస్‌గా వ్యవహరిస్తారు. ఎకరాకు సగటున 28–30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. 2023–24లో ఉన్న ధరతో పోలిస్తే.. ప్రతి రైతు ఎకరాపై రూ.30 వేల వరకు నష్టపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 41,498 ఎకరాల్లో సాగు

ఈ ఏడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో 41,498 ఎకరాల్లో వరి సాగయింది. కర్నూలు జిల్లాలో 8,718 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 32,780 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2023–24 రబీలో రికార్డు స్థాయిలో దిగుబడులు 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు వచ్చాయి. ఈ సారి చీడపీడల బెడద కారణంగా దిగుబడులు పడిపోయాయి. సగటున 25 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తోంది. ధరలు పడిపోయినప్పుడు అండగా నిలవాల్సిన ప్రభుత్వం రైతులు నష్టాలు మూట కట్టుకుంటున్నా స్పందించని పరిస్థితి. ఎకరాకు రూ.40 వేల పైనే పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం క్వింటాకు రూ.1,600 నుంచి రూ.1,800 వరకు మాత్రమే ధర లభిస్తోంది. ఎకరాకు పండించిన 30 క్వింటాళ్ల ధాన్యం అమ్మితే వచ్చే మొత్తం పెట్టుబడి వ్యయానికే సరిపోతుండగా, నికర ఆదాయం శూన్యం.

ప్రభుత్వం చేత మద్దతు ధరతో కొనే విధంగా కొనుగోలు కేంద్రాలు పెట్టించమని బండి ఆత్మకూరు రైతులు స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కోరారు. అయితే

గోదాముల్లో నిల్వ చేసుకోండి

ఆయన గోదాముల్లో నిల్వ చేసుకోవాలని ఉచిత సలహా ఇవ్వడం చూస్తే రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది.

పెట్టుబడి కూడా దక్కదేమో



మాకు 14 ఎకరాల పొలం ఉంది. రబీలో షుగర్‌లెస్ రకం వరి సాగుచేశాం. పంట కోతకు వచ్చింది. ఒకటి, రెండు రోజుల్లో కొత కోయనున్నాం. ధర ఆందోళన కలిగిస్తోంది. ఖరీఫ్‌తో పోలిస్తే పెట్టుబడి వ్యయం పెరిగింది. ఎకరాకు సగటున రూ.45 వేల వరకు పెట్టుబడి పెట్టాం. ఎకరాకు 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. వ్యాపారులు క్వింటా ధాన్యాన్ని రూ.1,800 ధరతో అడుగుతున్నారు. ఈ ధరతో అమ్ముకుంటే పెట్టిన పెట్టుబడి మాత్రమే వస్తుంది. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తే కొంత వరకు నికరాదాయం వస్తుంది. గత ఏడాది క్వింటా రూ.2,800 ప్రకారం అమ్ముకున్నాం.

– చిన్నలింగమయ్య, సంతజూటూరు, బండిఆత్మకూరు

రైతులు బాగుపడేది ఎప్పుడు



మాకు రెండెకరాలు సొంత భూమి ఉండగా.. మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. ఎల్లెల్సీ కింద మొత్తం 5 ఎకరాల్లో గంగాకావేరి రకం వరి సాగు చేశాం. కౌలు కింద ఎకరాకు 10.50 క్వింటాళ్లు ఇవ్వాల్సి ఉంది. ఇటీవలనే పంటను కోసి విక్రయించాం. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాం. దిగుబడి ఎకరాకు 28 క్వింటాళ్ల ప్రకారం వచ్చింది. కౌలు కింద 31.50 క్వింటాళ్లు పోగా 108.5 క్వింటాళ్ల ధాన్యం రూ.1,800 ప్రకారం అమ్మితే రూ.1.95 లక్షలు వచ్చింది. పెట్టుబడితో పోలిస్తే నష్టమే మిగిలింది. ఇలాగైతే రైతులు బాగుపడేది ఎప్పుడో.

– సిందువాళం కృష్ణయ్య, హొళగుంద

ఉమ్మడి జిల్లాలో వరి సాగు వివరాలు

జిల్లా	వరి సాగు
కర్నూలు	13,112
నంద్యాల	8,718
మొత్తం	41,498

అత్యధికంగా వరిసాగు మండలాలు

నంద్యాల జిల్లా: బండిఆత్మకూరు, వెలుగోడు, రుద్రవరం, శిరువెళ్ల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, మహానంది.

కర్నూలు జిల్లా: కౌతాళం, కోసిగి, హొళగుంద, పెద్దకడుబూరు, నందవరం, హాలహర్వి, ఎమ్మిగనూరు, ఆదోని.

కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం

ఉమ్మడి జిల్లాలో వరి సాగులో కౌలుదారుల సంఖ్య ఎక్కువగానే ఉంది. నంద్యాల జిల్లాలో ఎకరాకు 15 బస్తాలు(75 కిలోలు), కర్నూలు జిల్లాలో ఎకరాకు 14 బస్తాల ప్రకారం కౌలు కింద చెల్లిస్తారు. ఎకరాకు సగటున 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా.. ఇందులో 10 క్వింటాళ్లకు పైగా ధాన్యం కౌలు కింద భూ యజమానికి ఇస్తే రైతుకు పెట్టిన పెట్టుబడిలో 50 శాతం లభించడం కూడా కష్టమవుతోంది. కౌలు సహా ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడి పెడితే పంటను అమ్మితే వస్తున్న మొత్తం రూ.20 వేల వరకు మాత్రమే. ధాన్యం పండించిన రైతులు ధర లేక దిక్కుతోచని స్థితిలో ఉంటున్నా ప్రభుత్వంలో చలనం కరువైంది.

వైఎస్సార్‌సీపీ పాలనలో మద్దతుతో భరోసా

2019–20 నుంచి 2023–24 వరకు అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా నిలిచింది. ముందస్తు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల్లో ఆత్మస్థైర్యం నింపింది. ఐదేళ్లలో ధరలు తగ్గినప్పుడు ధాన్యంతో పాటు అన్ని రకాల పంట ఉత్పత్తులను కూడా మద్దతు కొనుగోలు చేసింది. వరి కోతలకు ముందే పౌరసరఫరాల సంస్థ ద్వారా ముందస్తుగా ఆర్‌బీకేల వారీగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది.

బాల్యానికి మూడు‘ముళ్లు’



- నంద్యాల పట్టణంలోని ఓ వీధికి చెందిన 17 ఏళ్ల యువకుడు ఇతర ప్రాంతాలకు వెళ్లి గృహ అవసరాల వస్తువులను విక్రయించేవాడు. అయితే స్థానికంగా నివాసం ఉంటున్న 14 ఏళ్ల బాలికపై కన్నేశాడు. నిత్యం ఏదో ఒక వంకతో అమ్మాయి వెంట పడుతూ మాయమాటలతో నమ్మించాడు. పెళ్లి చేసుకుందామంటూ వేరే ప్రాంతానికి తీసుకెళ్లాడు. రెండు రోజుల తర్వాత ఇంటికి తిరిగి వచ్చారు. తల్లిదండ్రులకు తెలిసినా పరువు పోతుందనే భావనతో పెళ్లి చేసేందుకు నిశ్చయించుకున్నారు. విషయం సంబంధిత అధికారులకు తెలియడంతో ఇరు కుటుంబాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లిని నిలుపుదల చేశారు.

- ఆత్మకూరు చెందిన ఓ యువకుడు ఓ కాలనీలోని ఓ బాలికను ప్రేమిస్తున్నాంటూ దగ్గరయ్యాడు. ఎవరికీ తెలియకుండా వివాహం చేసుకుందామంటూ బాలికను నమ్మించాడు. తల్లిదండ్రులను ఒప్పించి పెళ్లి చేసుకుందామంటూ అమ్మాయి మెలిక పెట్టింది. అప్పటికీ అబ్బాయికి 21 సంవత్సరాలు కాగా బాలికకు 16 సంవత్సరాలు. రహస్యంగా ఇరువురు కలుసుకుంటుండటంతో బాలిక మూడు మాసాల గర్భం దాల్చినట్లు సమాచారం. ఈ వ్యవహారాన్ని ఇరు కుటుంబాల వారు గోప్యంగా ఉంచి పెళ్లి చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఆ నోటా ఈనోటా పెళ్లి విషయం అధికారులకు తెలియదంతో అడ్డుకున్నారు.

- గుట్టుగా మైనర్లకు వివాహాలు
- ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం
- ఎనిమిది నెలల్లో 73 బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు
- బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవంటున్న వైద్యులు

ఆగిన బాల్య వివాహాలు ఇలా..

2024		2025	
ఆగస్టు	22	జనవరి	4
సెప్టెంబర్	13	ఫిబ్రవరి	4
అక్టోబర్	8	మార్చి	2
నవంబర్	6	ఏప్రిల్	11
డిసెంబర్	3	మొత్తం	73

నంద్యాల(అర్బన్): ఆడుతూ, పాడుతూ చదువుకోవాల్సిన చిన్నారులకు కొందరు తల్లిదండ్రులు మూడు ముళ్ల బంధంతో ముకుతాడు వేస్తున్నారు. బాల్య వివాహాలతో బరువుకు మించిన బాధ్యతలు మోపుతున్నారు. చిన్న వయసులోనే వివాహాలు జరుగుతుండడంతో చాలామంది శారీరకంగా, మానసికంగా ఇబ్బందిపడుతున్నారు. బాల్య వివాహాలకు చెక్ పెట్టడానికి అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. సరైన అవగాహన లేక వివిధ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరిపిస్తూనే ఉన్నారు. జీవితమంటే ఏమిటో తెలియని పసి వయసులోనే ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయడం. అంతలోనే గర్భం దాల్చడం వంటి ఘటనలు జిల్లాలో పెరిగిపోతున్నాయి. అధికారులు అప్రమత్తం కావడంతో గత 8 నెలల వ్యవధిలో 62 బాల్య వివాహాలు ఆగిపోయాయి. జిల్లా బాలల సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, గ్రామాల్లో అధికారులు బాల్య వివాహాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. అయినా గుట్టుచప్పుడు కాకుండా బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. అనాగరికత, వలసలు వెళ్లడం, ఆర్థిక సమస్యలు తదితర కారణాలతో జిల్లాలో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. నంద్యాల పట్టణంలోని సుద్దులపేట, నందమూరినగర్, వైఎస్‌నగర్ ప్రాంతాలతో పాటు డోన్, పాణ్యంలలో ఇటీవల పలు బాల్య వివాహాలు జరగడాన్ని తెలుసుకున్న సంబంధిత అధికారులు దాడులు చేసి నిలుపుదల చేశారు. అయితే ఏప్రిల్ మాసంలోనే జిల్లాలో 11 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. బాల్య వివాహాల కారణంగా చిన్న వయస్సులోనే బాలికలు గర్భం దాలుస్తున్నారు. ఫలితంగా శారీరకంగా ఎదుగుదల లోపించడంతో పాటు పలు అనారోగ్య సమస్యల బారినపడుతున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా ఆడబిడ్డల తల్లిదండ్రులు చిన్న వయసులోనే బాలికలను ఇల్లు దాటించేందుకు ప్రయత్నిస్తున్నారు.

“ చట్ట ప్రకారం చర్యలు



బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098కు కాల్ చేసి సమాచారం ఇవ్వండి. చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. ఇటీవల కాలంలో కేజీబీవీలు, కాలేజీల్లో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, మహిళా చట్టాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఏడాది కాలంలో 118 బాల్య వివాహాలను అడ్డుకుని బాలికలను రక్షించాం.

– స్వప్న ప్రియదర్శిణి, డీసీపీఓ, నంద్యాల

తల్లిదండ్రులు ఆలోచించాలి



చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేయడం నేరం. అమ్మాయిలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలి. అంతకు ముందే వివాహం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు. బాల్య వివాహాలతో గర్భం దాల్చడం బాలికల ఆరోగ్యానికి ప్రమాదకరం. చదివే వయస్సులోనే ఇంటి బాధ్యతలు మోయాల్సిన అవసరం లేదు. చదివితే ఉన్నత స్థాయికి వెళ్లి మంచి ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుంది.

– లీలావతి, ఐసీడీఎస్ పీడీ, నంద్యాల

వామ్మో ఎండలు



కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ఎండలు మండుతుండటంతో ప్రజలు ఉక్కిరి, బిక్కిరవుతున్నారు. ప్రధానంగా నంద్యాల జిల్లాలో ఎండలు, వడగాల్పుల తీవ్రత ఎక్కువ గా ఉంటోంది. ఆళ్లగడ్డలో 41.8 డిగ్రీలు, గోస్పాడులో 41.5, రుద్రవరంలో 41.3, ఉయ్యాలవాడ, కోవెలకుంట్లల్లో 41, మహానందిలో 40.9, బండిఆత్మకూరు, కోడుమూరులో 40.8, నందికొట్కూరులో 40.6, కోసిగి, కల్లూరులో 40.4, గడివేముల, పాణ్యంలో 40.3, బనగానపల్లిలో 40.2, నంద్యాలలో 40.1, పగిడ్యాల, జూపాడుబంగ్లాలో 40 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా రానున్న నాలుగైదు రోజుల్లో ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

బొమ్మలసత్రం: పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం సంజీవరావుపేట గ్రామానికి చెందిన షేక్ దివ్యాంగుడు నబిరసూల్ (50) మంగళవారం అపస్మారక స్థితిలో పడిపోవడంతో స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా వైద్యులు పరిశీలించి వడదెబ్బ కారణంగా అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుని వద్ద ఉన్న పత్రాల ఆధారంగా పేరు, చిరునామా లభించాయని, కుటుంబీకులకు సమాచారం ఇచ్చామని రెండవ పట్టణ సీఐ ఇస్మాయిల్ తెలిపారు.

50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాకు 500 టన్నుల దాణాను ప్రభుత్వం కేటాయించింది. కర్నూలు జిల్లాకు 250, నంద్యాల జిల్లాకు 250 టన్నుల ప్రకారం మంజూరు చేసింది. 50 శాతం సబ్సిడీపై పాడి పశువులకు సమీకృత దాణా పంపిణీ చేస్తున్నట్లుగా పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలకు నంద్యాలలోని మార్క్ ఫెడ్ దాణా ఉత్పత్తి కేంద్రం సరఫరా చేస్తుంది. 50 కిలోల బస్తా పూర్తి ధర రూ.1,110 ఉండగా.. ఇందులో రూ.555 సబ్సిడీ ఉంటుందని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. పాడి పశువులు కలిగిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో నాన్ సబ్సిడీ చెల్లించి దాణా పొందవచ్చని తెలిపారు. ప్రస్తుతానికి ఒక రైతుకు 50 నుంచి 100 కిలోల వరకు పంపిణీ చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ పార్లమెంటు పరిశీలకుల నియామకం



గంగుల ప్రభాకర్‌రెడ్డి



కల్పలతా రెడ్డి

నంద్యాల(అర్బన్): కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు పరిశీలకులను ప్రకటించింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాకు మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల జిల్లాకు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిలను నియమించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి వీరిరువురిని నియమిస్తు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంటు పార్టీ పరిశీలకులుగా నియమించిన వీరిరువురు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లకు అనుసంధానంగా పనిచేస్తారని ఒక ప్రకటనలో వెల్లడించింది.

సాగు నీటి పన్ను బకాయిల వసూలుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గోస్పాడు: ఏళ్ల తరబడి పేరుకుపోయిన సాగునీటి పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సాగు నీటి పన్ను వసూళ్లు, ఆయకట్టు స్థిరీకరణపై ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీ కెనాల్ ఆయకట్టు కింద 1,62,854.46 ఎకరాలకు, ఎస్ఆర్‌బీసీ కింద 1,53,034.8 ఎకరాలకు, తెలుగు గంగ ప్రాజెక్టు కింద 1,28,246.73 ఎకరాలకు, మైలవరం రిజర్వాయర్ కింద 740.21 ఎకరాలకు, శివ భాష్యం సాగర్ ప్రాజెక్టు కింద 12,092 ఎకరాలకు, 104 ఎత్తిపోతల ద్వారా 40,056.79 ఎకరాల కు నీరు అందివ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆయకట్టుకు అందుతున్న సాగునీటి మేరకు ఐదేళ్లలో దాదాపు రూ. 20 కోట్ల వరకు సాగునీటి పన్ను వసూళ్లు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 360 గ్రామాల ఉంచి నీటి పన్ను వసూలు చేయడం జరుగుతుందన్నారు. 104 గ్రామాల్లో నీటి పన్ను వర్తించరాదన్న అంశంపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పునఃపరిశీలన చేయాలన్నారు. పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. అలాగే సిద్ధాపురం లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి 21,300 ఎకరాల ఆయకట్టును స్థిరీకరణ చేసేలా రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నా రు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రామునాయక్, కర్నూలు, నంద్యాల జిల్లాల నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్లు రెడ్డి శేఖర్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ధగధగల వెనుక దగా!

మెరిసిపోతున్న బంగారం ధర

- ఉక్కిరిబిక్కిరవుతున్న సామాన్య, మధ్య తరగతి ప్రజలు
- బంగారం వ్యాపారంలో జీరోదే పెత్తనం
- ఆథరైజ్డ్ బిల్లు ఇచ్చేది కొందరే..
- అన్నింటికీ 22 క్యారెట్ల ధర వసూలు
- అమ్మకాలు పెంచుకునేందుకు ఆఫర్లతో జోరు
- నేడు అక్షయ తృతీయ

కర్నూలు(అగ్రికల్చర్): బంగారం ధర ఆకాశాన్నంటుతోంది. ఊహించని విధంగా ధరలు పెరుగుతుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో ఆందోళన అధికమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారానికి డిమాండ్ పెరగడం, అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గడం, పెట్టుబడిదారులు బంగారంపైనే అధికంగా దృష్టి పెట్టడం తదితర కారణాలు ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా 2024, 2025 సంవత్సరాల్లోనే ధరలు దూసుకుపోతున్నాయి. ఈ నెల 30 అక్షయ తృతీయ. ఆ రోజున బంగారం కొంటే లక్ష్మీ దేవిని ఇంటికి ఆహ్వానించినట్లేనన్న నమ్మకం ప్రజల్లో ఉంది. మిగతా రోజులతో పోలిస్తే ఆ రోజున బంగారం వ్యాపారం మూడు, నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుంది. అయితే ధరలు పెరిగిన నేపథ్యంలో అక్షయ తృతీయ రోజున బంగారం వ్యాపారం ఎలా ఉంటుందోననే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

స్వచ్ఛమైన బంగారానికి హాల్ మార్క్

బంగారం కొనుగోలులో తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. స్వచ్ఛమైన బంగారానికి సాధారణంగా హాల్ మార్క్ ఉంటుంది. బ్యూరో ఆఫ్ స్టాండర్డ్ (బిఐఎస్) హాల్ మార్క్ ఇస్తుంది. అయితే కార్పొరేట్ సంస్థలు హాల్ మార్క్ సెటప్ చేసుకున్నట్లుగా ప్రకటించుకుంటూ నాణ్యతకు సొంత మార్కు ఇచ్చుకుంటున్నాయి. బంగారం కొనుగోలులో హాల్ మార్క్, క్యారెట్లను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. నిబంధనల మేరకు బంగారాన్ని బ్యాంకుల ద్వారా దిగుమతి చేసుకోవాల్సి ఉంది. ఐసీఐసీఐ, యాక్సిస్, ఇండియన్ ఓవర్సీస్ తదితర బ్యాంకులు సరఫరా చేస్తున్నాయి.

బిల్లు తీసుకోకపోతే నష్టమే..

బంగారం వ్యాపారంలో 85 శాతం జీరో జరుగుతోంది. 90 శాతం వ్యాపారులు ఆథరైజ్డ్ బిల్లులు ఇవ్వడం లేదు. కేవలం షాపు పేరు కలిగిన కాగితాలపై బిల్లులు ఇస్తున్నారు. వీటిలో పాన్‌నెంబర్, వ్యాట్ నెంబర్ ఇతరత్రా వివరాలు ఉండవు. ఇలా ఇవ్వడం జీరో వ్యాపారం కిందకు వస్తుంది. మరికొందరు తెల్లపేపర్‌పైనే వివరాలు రాసిస్తుండటం గమనార్హం. వాణిజ్య పన్నుల శాఖ, ఆదాయపు పన్ను, కస్టమ్స్ ఎక్సైజ్ సుంకం అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. బంగారం పోగొట్టుకున్నా.. దొంగలు ఎత్తుకెళ్లినా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బిల్లులు తప్పనిసరి. కొంతమంది వ్యాపారులు తూకాల్లో దగా చేస్తున్నట్లు తెలుస్తోంది. తూనికలు, కొలతల శాఖకు వారి టార్గెట్లకు అనుగుణంగా తనిఖీలు చేయడం, కేసులు పెట్టడం తప్ప అక్రమాలను అరికట్టాలనే చిత్తశుద్ధి లోపించినట్లు తెలుస్తోంది.

కొనుగోలులో అప్రమత్తత అవసరం

స్వచ్ఛమైన బంగారం కొంటే తిరిగి అమ్ముకున్నప్పుడు ఆ రోజు ఉన్న ధర లభిస్తుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 1,500 వరకు బంగారం దుకాణాలు ఉన్నాయి. 24 క్యారెట్ బంగారం బిస్కెట్ రూపంలో లభిస్తుంది. ఇది పూర్తిగా స్వచ్ఛమైనది. బంగారం ఆభరణాలు మాత్రం 22 క్యారెట్లలో ఉంటాయి. వీటి స్వచ్ఛత 916 ఉంటుంది. జిల్లాలో జరిగే వ్యాపారంలో 80 శాతం వరకు 22 క్యారెట్ల బంగారం(నగలు, ఆభరాణాలు) కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు 22 క్యారెట్ల బంగారం విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



కొనుగోలు దారులతో కిక్కిరిసిన బంగారు దుకాణం



14, 16, 18 క్యారెట్ల బంగారానికి 22 క్యారెట్ల ధర వసూలు



కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాలతో సహా అన్ని ప్రాంతాల్లోని కొందరు వ్యాపారులు 14, 16, 18, 20 క్యారెట్ల బంగారం ఆభరణాలు అమ్ముతూ వాటికి 22 క్యారెట్ల ధర వసూలు చేస్తుండటం గమనార్హం. ప్రస్తుతం 10 గ్రాముల ఆర్నమెంటు బంగారం ధర రూ.89,400 పలుకుతోంది. ఒక క్యారెట్ విలువ రూ.4,063.63. 22 క్యారెట్లు(916 స్వచ్ఛత) ఉన్న బంగారమైతే ఈ ధర చెల్లించాలి. వినియోగదారులు కొనుగోలు చేసే బంగారం 20 క్యారెట్లు కలిగినదైతే 10 గ్రాముల ధర రూ.81,272 అవుతుంది. కానీ అధిక శాతం జ్యువెలరీ షాపుల్లో తక్కువ క్యారెట్లు ఉన్న బంగారానికి కూడా 22 క్యారెట్ల బంగారం ధర వసూలు చేస్తుండటం గమనార్హం.

ఈనెల 28న బంగారం ధరలు

- 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.89,400
- 24 క్యారెట్ల ధర రూ.97,530.
- ఈ ధరలకు తరుగు కలిపితే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.లక్ష దాటుతుంది.

ఉమ్మడి జిల్లాలో తూనికలు, కొలతల శాఖ నమోదు చేసిన కేసులు

సంవత్సరం	కేసులు	జరిమానా
2023-24	13	రూ.1.51 లక్షలు
2024-25	37	రూ.1.95 లక్షలు

కొనక తప్పడం లేదు



బంగారం ధరలు అందుబాటులో ఉంటే కాస్త ఎక్కువ కొంటాం. మా కుటుంబంలో వివాహం ఉన్నందున ధర ఎంతున్నా కొనక తప్పడం లేదు. అక్షయ తృతీయ నేపథ్యంలో ఆఫర్లు ఉండటంతో బంగారం కొనడానికి మలబార్ గోల్డ్‌కు వచ్చాం. ఆర్నమెంటు బంగారం 10 గ్రాముల ధర రూ.89,800 ఉన్నప్పటికీ డిజైన్‌ను బట్టి తరుగు కలుపుతుండటంతో రూ.లక్ష పైనే అవుతోంది. ఇంత ధర ఉండటం నిజంగా బాధాకరమే.

– ప్రత్యూష, సంతోష్‌నగర్, కర్నూలు


ధరలు తగ్గించాలి




బంగారం ధరలు తగ్గించే దిశగా కేంద్రం చర్యలు తీసుకోవాలి. రోజు రోజుకు ధరలు భారీగా పెరిగిపోతుండటం మధ్య తరగతి వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం శుభకార్యాలు, అక్షయ తృతీయ ఉండటంతో బంగారం కొనడానికి వచ్చాం. బంగారం అంటే ప్రతి ఒక్కరికి మక్కువ ఉన్నప్పటికీ వనరులను బట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది.

– శైలజ, కోడుమూరు

ఆకట్టుకుంటున్న డిజైన్లు



- సాధారణ ప్రజల నుంచి ఉన్నత స్థాయి వర్గాలకు తగిన విధంగా డిజైన్‌లు సిద్ధం చేశారు.
- కార్పొరేట్ సంస్థలు వ్యాపారాన్ని పెంచుకునేందుకు ఆఫర్లు భారీగానే ప్రకటించాయి.
- డైమండ్స్, యాంటిక్ జ్యువెలరీ, రూబీ ఎమరాల్డ్ క్యాస్టింగ్, టెంపుల్ జ్యువెలరీ, ఫ్యాషన్ జ్యువెలరీ, రాజ్‌కోట్ లైట్‌వెయిట్ జ్యువెలరీ, కోల్‌కతా ఎనామిల్ వర్క్ డిజైన్‌లు, వడ్డాణాలు, గాజులు, చైన్‌లు, నెక్లెస్‌లు మెరిసిపోతున్నాయి.
- మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసేందుకు వీలుగా లైట్ వెయిట్ రకాలను భారీగా అందుబాటులోకి తీసుకురావడం విశేషం.
- గ్రాము మొదలుకొని 100 గ్రాముల నాణేలను కూడా విక్రయిస్తున్నారు.





నగలను పరిశీలిస్తున్న మహిళలు

క్లుప్తంగా

సచివాలయ శిలాఫలకం కూల్చివేత



బొందిమడుగులలో కూల్చివేసిన శిలాఫలకం

తుగ్గలి: మండల పరిధిలోని బొందిమడుగులలో సచివాలయ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2020 నవంబర్ 13న సచివాలయ నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేత భూమి పూజ చేయించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఆమె ఫొటోతో ఉన్న శిలాఫలాకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన ట్రెజరీ ఉద్యోగి

- గాలి లేక సొమ్మసిల్లి పడిపోయిన వైనం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు బి.క్యాంపులోని ఆర్థిక భవనం లిఫ్ట్‌లో ట్రెజరీ ఉద్యోగి ఒకరు ఇరుక్కుపోయారు. మంగళవారం ఉదయం 12 గంటల ప్రాంతంలో ఆర్థిక భవనం ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ట్రెజరీ ఉద్యోగి ఒకరు కింది నుంచి లిఫ్ట్ ద్వారా పై అంతస్తులోని తమ కార్యాలయానికి వెళ్తుండగా.. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో సదురు ఉద్యోగి లిఫ్ట్‌లో చిక్కుకుపోయారు. మధ్యలో ఇరుక్కుపోవడం, గాలి లేకపోవడంతో అరగంట పాటు ఉక్కిరిబిక్కిరయ్యారు. చివరికి సొమ్మసిల్లి పడిపోయారు. ట్రెజరీ అధికారులు అధికారులపై ఒత్తిడి తేవడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ట్రెజరీ ఉద్యోగులు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. విద్యుత్ ఎపుడు ఉంటుందో.. ఎపుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండటంతో లిఫ్ట్‌లో వెళ్లడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది.

రోడ్డుప్రమాదంలో గ్రీన్‌కో కార్మికుడి మృతి

ఓర్వకల్లు: మండల పరిధిలోని ఉశేనాపురం గ్రామ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రీన్‌కో కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖపట్నానికి చెందిన వీరరాజు (30) స్థానిక గ్రీన్‌కో కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. హుసేనాపురం గ్రామ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు స్పందించి 108లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుకు వ్యక్తి మృతి



మద్దిలేటి (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని దైవందిన్నె గ్రామానికి చెందిన బోయ మద్దిలేటి (35) సోమవారం అర్ధరాత్రి పాము కాటుకు గురై మృతి చెందాడు. మద్దిలేటి రాత్రి భోజనం అనంతరం చిన్నభార్య రిజ్వానాతో కలిసి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి పాము కాటువేయడంతో ఏదో పురుగు కొరికిందని అలాగే నిద్రపోయాడు. కొద్ది సేపటికి రిజ్వానా సమీపానికి పాము వెళ్లడంతో ఆమె కాలితో తోయడంతో మరోసారి మద్దిలేటిని కాటు వేసింది. అతడు లేచి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చేలోపు పాము తపించుకుని పోయింది. మద్దిలేటిని పాలకలదిన్నె గ్రామంలో నాటు వైద్యం చేయించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా మద్దిలేటి వైఎస్సార్ సీపీ కార్యకర్తగా ఉన్నాడు.

ఆగమ విద్య ఎంతో గొప్పది

- ఈఓ ఎం. శ్రీనివాసరావు



ఆగమ పాఠశాల విద్యార్థులను సన్మానించిన ఈఓ

శ్రీశైలంటెంపుల్: ఆగమ విద్య ఎంతో గొప్పది శ్రీశైల దేవస్థానం ఈఓ ఎం. శ్రీనివాసరావు అన్నారు. శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వీరశైవాగమ పాఠశాలలో 2018 –19 విద్యాసంవత్సరానికి ప్రవేశం పొంది ఆరేళ్ల వీరశైవాగమ కోర్సు(ప్రవేశ, వర, ప్రవర) పూర్తి చేసుకున్న 25 మంది విద్యార్థులను మంగళవారం అక్కమహాదేవి అలంకార మండపంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ నియమనిష్ఠలతో ఆగమ విద్యనభ్యసించిన విద్యార్థులకు భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల కృపతో మంచి భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. నిరంతర పఠనంతో సంస్కృతం, జ్యోతిష్యం, వాస్తు తదితర అంశాలపై మరింత అవగాహన పెంచుకుని, సనాతన ధర్మం, ఆచార సంప్రదాయాలపై భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్వామివారి ఆలయ ఉపప్రధానార్చకులు, ఆగమ పాఠశాల ప్రిన్సిపాల్ మఠం శివశంకరయ్యస్వామి, పర్యవేక్షకులు డి.నాగేశ్వరరావు, ఆంగ్ల అధ్యాపకులు డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామానికి చెందిన చిన్నమూతి నాగరాజు (38) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ హనుమంత రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కొండయ్య, ఈరమ్మ దంపతుల కుమారుడు నాగరాజు తాగుడుకు బానిసై చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతుండటంతో మొదటి భార్య విడాకులు తీసుకుంది. కందుకూరు గ్రామానికి చెందిన దుర్గమ్మతో రెండో వివాహం కాగా వీరికి కుమారుడు ఉన్నాడు. కాగా ఇటీవల అతిగా మద్యం తాగుతూ మతిస్థిమితం సరిగా లేక తిరుగుతుండేవాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈక్రమంలో కామన్‌దొడ్డి పొలాల్లో మృతిచెంది ఉన్నాడని తెలుసుకుని కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి గుర్తించి బోరున విలపించారు. ఎండ వేడిమికి మృతిచెందాడా మరేదైనా కారణాలతోనా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అయ్యో కాంతమ్మ!

- 20 రోజుల తేడాతో పింఛన్‌కు దూరం



భర్త మరణ ధ్రువీకరణ పత్రంతో కాంతమ్మ

దొర్నిపాడు: భర్త మరణించినా స్పౌజ్ కింద భార్యకు పింఛన్ ఇవ్వనున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో క్రిష్టిపాడు గ్రామానికి చెందిన పాలుట్ల కాంతమ్మ సంబర పడింది. భర్త మరణ ధ్రువీకరణ పత్రం చేతబట్టుకుని సచివాలయానికి వెళ్లగా అక్కడ చుక్కెదురైంది. కాంతమ్మ భర్త పాలుట్ల ఓబన్న(పింఛన్ ఐడీ 113500540) అలియాస్ ఎర్రాయం 2023 నవంబర్ 9న మృతిచెందాడు. కానీ కూటమి ప్రభుత్వం 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య మృతిచెందిన వారి స్పౌజ్‌లు మాత్రమే అర్హులనే నిబంధన విధించడంతో కేవలం 20 రోజులు తేడాతో అనర్హురాలిగా మిగిలిపోయానని కాంతమ్మ వాపోయింది. కాగా సంక్షేమ పథకాలంటూనే కొర్రీలు వేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వెన్నతోపెట్టిన విద్య అంటూ పలువురు ఆరోపించారు.

పూడూరు హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

- టీచర్‌గా పనిచేస్తూనే ఎల్ఎల్‌బీ చేసినట్లు ప్రాథమిక నిర్ధారణ

కర్నూలు సిటీ: మండల పరిధిలోని పూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం(గ్రేడ్-2) ఎంవీ శేషఫణిరాజుపై సస్పెన్షన్ వేటు పడింది. అలాగే అతడితో ముగ్గురి ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్లు చేయించడంలో జాప్యం చేసిన డీఈఓ, సూపరింటెండెంట్, సెక్షన్ అసిస్టెంట్లకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

సమాచారం ఇవ్వకుండా లా కోర్సు పూర్తి..

2009–2012 మధ్య ఎంవీ శేషఫణి రాజు గోనెగండ్లలో స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్)గా పనిచేస్తూనే కర్నూలు ప్రసూనా లా కాలేజీలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ రెగ్యులర్‌గా పూర్తి చేశారు. ఈ విషయమై ఫిర్యాదులు అందడంతో కర్నూలు డిప్యూటీ ఈఓ, సి.బెళగల్ ఎంఈఓ–2తో రెండు సార్లు కమిటీలు ఏర్పాటు చేసినా విచారణ చేసేందుకు ఎవరూ సాహసించలేదు. ఈక్రమంలో నాలుగైదు నెలలు జాప్యం కావడంతో చివరకు ఆర్జేడీ కే.శామ్యూల్ స్పందించి అనంతపురం డిప్యూటీ ఈఓతో విచారణ చేయించారు. విచారణ సమయంలోనూ ఎలాంటి ఆధారాలు లేకుండా ఎలా విచారణ చేస్తారని విచారణ అధికారిపైనే తిరగబడినట్లు సమాచారం. కాగా క్రమశిక్షణ చర్యలను ఉల్లంఘించి విద్యాశాఖను, లా కాలేజీని చీటింగ్ చేశారని విచారణ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా శేషఫణిరాజును సస్పెండ్ చేస్తూ ఈనెల 26న ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంక్రిమెంట్లు చేయించడంలో జాప్యంపై ..

పూడూరు ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ జి.నాగేంద్రుడుకు గతేడాది ఆగస్టులో, హిందీ టీచర్ సురేంద్రకు అక్టోబరులో ఇంక్రిమెంట్లు చేయకుండా జాప్యం చేయడంతోపాటు, బయాలజీ టీచర్ బాకార్ సాహెబ్‌కు నాలుగు నెలలుగా ఇంక్రిమెంట్ చేయకుండా ప్రస్తుత హెచ్ఎం ఎం.వి శేషఫణి రాజు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. బాధిత టీచర్లు జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు కూడా సకాలంలో జాప్యం చేయడంతో డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్, సూపరింటెండెంట్ రాజశేఖర్, సెక్షన్ అసిస్టెంట్ హరికి ఆర్జేడీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

అక్కజమ్మ చెరువులో యథేచ్ఛగా మట్టి దోపిడీ

- పట్టించుకోని మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



జేసీబీతో చెరువు మట్టిని వాహనాలకు నింపుతున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలోని చెరువుపల్లె గ్రామం వద్ద అక్క జమ్మ చెరువులో కూటమి నాయకులు మట్టి దోపిడీకి తెర తీశారు. రెండు రోజుల నుంచి జేసీబీలతో మట్టిని తవ్వి వాహనాల ద్వారా తరలిస్తూ మూడుపువ్వులు ఆరు కాయలుగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు కూటమి నాయకులు రాత్రి పగలు తేడలేకుండా చెరువులో మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టిని సారవంతంగా ఉండటంతో పలుకూరు, బీరవోలు, రామతీర్థం, జిల్లెల్లా, నందివర్గం, తిమ్మాపురంతోపాటు నంద్యాల ప్రాంతాలకు చెందిన రైతులకు కూటమి నేతలు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కాగా చెరువులో మట్టి తవ్వకాలపై మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్‌రెడ్డిని, తహసీలార్ నారాయణరెడ్డిలను వివరణ కోరగా మట్టి తవకాలకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి

- కలపరి గ్రామాన్ని సందర్శించిన మలేరియా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏటీ రామనాథరావు



కలపరిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డాక్టర్ ఏటీ రామనాథరావు

ఆస్పరి: ప్రతి ఒక్కరూ ఇళ్లను, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఏటీ రామనాథరావు సూచించారు. మండలంలోని కలపరి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్, డీఎంఓ (జిల్లా మలేరియా ఆఫీసర్) డాక్టర్ నూకరాజుతో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. గ్రామంలో 53 మంది జ్వరాల భారిన పడినట్లు తెలుసుకుని వారితో మాట్లాడారు. 26 మంది రక్త నమూనాలను సేకరించి పరీక్షించడంతో 10 మందికి చికున్ గున్యా వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయినట్లు ఆయన తెలిపారు. చికున్ గున్యా వ్యాధికి భయపడాల్సిన అవసరం లేదని, వ్యాధి నయం కావడానికి కొంత సమయం పడుతుందని రోగులకు ధైర్యం చెప్పారు. పాత్రల్లో నీరు నిల్వ ఉంచుకోవద్దని గ్రామస్తులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడేను డ్రైడేగా పాటించి ఇంట్లో పాత్రల్లో ఉన్న నీటిని పారబోసి శుభ్రం చేసుకోవాలన్నారు. పూర్తిగా జ్వరాలు తగ్గే వరకు గ్రామంలో వైద్య శిబిరం కొనసాగిస్తామన్నారు. అనంతరం వారు గ్రామంలో పర్యటించి చికున్ గున్యా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామంలో వీధులలో దోమల నివారణకు మందు స్ప్రే చేయించాలని యాటకల్లు సర్పంచ్ సుధమ్మ, పంచాయితీ కార్యదర్శి సురేష్‌కు సూచించారు. వైద్య శిబిరంలో పత్తికొండ డిప్యూటీ డీఎంహెచ్ఓ రఘురామిరెడ్డి, డాక్టర్లు చంద్రశేఖర్, రామచంద్రుడు,దుర్గాబాయి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఏటీఎం దొంగలకు జైలు, జరిమానా



ఏటీఎం దొంగలను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కర్నూలు: కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలోని ఎన్‌హెచ్44 సర్వీస్ రోడ్డు పక్కనున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం మిషన్‌ను టోయింగ్ వాహనంతో తాళ్లు కట్టి బయటకు లాక్కుని పోవడానికి యత్నించిన నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.14 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సరోజినమ్మ మంగళవారం తీర్పునిచ్చారు. హరియానా రాష్ట్రానికి చెందిన సున్నీ షాహిద్ ఖాన్, సున్నీ ఇమ్రాన్ ఖాన్, మహమ్మద్ జంషాద్ ఖాన్, మహమ్మద్ షావర్కర్ తదితరులు వృత్తి రీత్యా డ్రైవర్లు కావడంతో కంటైనర్లలో అన్ని రాష్ట్రాలు తిరిగేవారు. మార్గమధ్యంలో చోరీకి అనుకూలంగా ఉన్న ఏటీఎం కేంద్రాలను గుర్తించి చోరీలకు పాల్పడేవారు. అందులోభాగంగా ఈ అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు చిన్నటేకూరు గ్రామంలోని ఎన్‌హెచ్44 సర్వీసు రోడ్డు పక్కనున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్రాన్ని కొల్లగొట్టేందుకు ఈ ఏడాది ఫిబ్రవరి 24న యత్నిస్తుండగా గ్రామ యువకులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, గ్రామ యువకులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఏటీఎం మిషన్‌ను రోడ్డు పక్కన వదిలి టోయింగ్ వాహనంతో దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏటీఎం కేంద్రం వద్ద సీసీ టీవీ ఫుటేజీలో నిందితుల కదలికలను గుర్తించి పక్కా ఆధారాలతో మార్చి 6న అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. స్పెషల్ మొబైల్ కోర్టు విచారణ జరిపి నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సరోజమ్మ తీర్పు చెప్పారు. నెలన్నర వ్యవధిలోనే నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన స్పెషల్ ఏపీపీ అనిల్ కుమార్, డీఎస్పీ బాబుప్రసాద్, సీఐ చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ, కోర్టు కానిస్టేబుళ్లు మహేష్, శేకన్నను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు.

లోక్ అదాలత్ బాధితురాలికి సత్వర న్యాయం

- 7.5 శాతం వడ్డీతో రూ.5 లక్షల వైఎస్సార్ బీమా చెల్లింపునకు ఆదేశాలు

కర్నూలు(సెంట్రల్): వైఎస్సార్ ప్రమాద బీమాను 7.5 శాతం వడ్డీతో రూ.5 లక్షలను క్లెయిమ్ చేయాలని ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీకి శాశ్వత లోక్ అదాలత్ ఆదేశాలిచ్చింది. వెల్దుర్తికి చెందిన పోల్దాస్ గోరంట్ల పత్తి పొలానికి మందు పిచికారీ చేసి అధిక మోతాదుతో ఉన్న విష వాయులను పీల్చడంతో అస్వస్థతకు గురయ్యారు. అతన్ని చికిత్స కోసం 2023 జూలై 13న డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈక్రమంలో అతనికి వైఎస్ఆర్ ప్రమాద బీమా కింద రూ.5లక్షల క్లెయిమ్ కోసం మృతుడి భార్య పి.లక్ష్మీదేవి స్థానిక గ్రామ సచివాలయంలో అన్ని రకాల ఫారాలను సమర్పించి దరఖాస్తు చేసింది. అయితే ఈ క్లెయిమ్‌ను ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ తిరస్కరించింది. ఈ క్రమంలో మృతుడు భార్య పి.లక్ష్మీదేవి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించింది. క్లెయిమ్‌ను ఎందుకు తీరిస్కరించిందో ఇన్సూరెన్స్ కంపెనీ కారణం చెప్పలేదు. ఈక్రమంలో వాది, ప్రతివాదులను వారి అడ్వకేట్లు ఎంఎల్ శ్రీనివాస రెడ్డి, గురుశంకర్య, ఎస్.ఇసాయ్య సమక్షంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్, సభ్యులు టి.శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు కూర్పొబెట్టి కేసును పరిష్కరించారు. సేవా లోపం ఉండడంతో 2023 అక్టోబర్ 16 నుంచి వైఎస్సార్ ప్రమాద బీమా రూ.5 లక్షలను 7.5 శాతం వడ్డీతో చెల్లించేలా ఆదేశాలిచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



బొమ్మలసత్రం: నంద్యాలలోని నూనెపల్లె సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ కే కుమారి మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి నూనెపల్లె రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి 30 ఏళ్ల వయస్సున్న వ్యక్తి మృతి చెందాడని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుడు తెల్లని టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించాడని ఆచూకీ తెలిసిన వారు 9490081633/ 9440627653 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ


శ్రీకాళికాంబాదేవి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబా చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని బాపూజీనగర్ గ్రామ వాసులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సీపీఎం మండల కమిటీ నాయకులు బాలవెంకట్ కోరారు. 500 కుటుంబాలు ఉన్న గ్రామంలో శ్మశాన వాటిక లేక ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం రూరల్ తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇచ్చారు.

చిన్నారులకు నీతి కథలు చెప్పాలి


దినపత్రికలు, నీతి కథల పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

దొర్నిపాడు: ప్రస్తుతం చిన్నారులు సెల్ మాయలో పడి మానసిక స్థితిని కోల్పోతున్నారని పూర్వపు రోజుల్లాగా వారికి నీతి కథలు చెప్పాల్సిన అవసరం ఉందని గ్రంథాలయాధికారి అఖిల బేగం అన్నారు. సమ్మర్ ఓరియేంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెప్పడంతో పాటు రచయితల సందేశాలను వినిపించారు. అనంతరం దినపత్రికలను చదివించి వాటి ఉపయోగాలను వివరించారు. తల్లిదండ్రులు తప్పని సరిగా ప్రతి రోజు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపాలని సూచించారు.

బేవరేజెస్ కార్మికుల నియామకాల్లో అక్రమాలు



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఐఎంఎల్ డిపోలో హమాలీల నియామకాల భర్తీలో అక్రమాలు జరిగాయని,దానిపై విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి తనయుడు హమాలీల నియామకాల్లో డబ్బులు ఇచ్చిన వారికి ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. బేవరేజేస్‌లో రాజకీయ జోక్యం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. బేవరేజెస్ కార్మికులకు న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామచంద్రుడు, తోటమద్దులు, గౌస్, బాలవెంకట్, పుల్లా నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

2న ఆర్‌యూ పీజీ విద్యార్థుల ఫేర్‌వెల్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, సైన్స్ కళాశాలల పీజీ విద్యార్థులకు మే 2వ తేదీన వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసినట్లు వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు పేర్కొన్నారు. ఫేర్‌వెల్ డేను పురస్కరించుకొని ఆర్‌యూ మైదానంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. శారీరక శ్రమను జీవన శైలిలో భాగం చేసుకున్నప్పుడే ఆరోగ్యవంతులవుతారన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్‌నాయుడు, క్రీడల కమిటీ కన్వీనర్ ఆచార్య ఆర్.భరత్‌కుమార్, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పీవీ సుందరానంద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు..
లాభాలు దక్కు!

- పెరగనున్న భూసారం, పంట దిగుబడులు
- తగ్గనున్న తెగుళ్ల బెడద
- వాలుకు అడ్డంగా దున్నితే నీటి నిల్వ శక్తి వృద్ధి

గోస్పాడు: రెండు నెలల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. రైతాంగం ఇప్పటి నుంచే సాగు సన్నాహాలు చేసుకుంటే మేలు. ముందస్తు ప్రణాళికతో అధిక దిగుబడులు, మంచి లాభాలు పొందే అవకాశముంటుంది. వర్షాలు పడగానే దుక్కులు దున్ని వెంటనే పైర్లు వేస్తే పంట ఎదుగుదల లోపించడంతో పాటు చీడ పీడల బారిన పడి పెట్టిన పెట్టుబడి రాదు. అదే సాగును వేసవి దుక్కులతో ప్రారంభించి సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ఆధునిక సాంకేతికతను అవలంభిస్తే రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. గోస్పాడు మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో వరి పైరు సాగవుతుంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్‌లలో ఇదే పంటను ఎక్కువ మంది వేస్తున్నారు.అయితే, భూమి సారవంతంగా ఉంటేనే వేసిన పంటలు ఆశించిన దిగుబడినిస్తాయి. అలాగని అదే భూమిలో వరుస పెట్టి ఒకే రకం పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంగా అయా భూములు నిస్సారమయ్యే ప్రమాదం ఉంది. అందుకనే మన పూర్వీకులు ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పండించిన భూముల్లో వేసవిలో దుక్కులు చేపట్టి, భూసారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసేవారు. ప్రస్తుతం చాలా మంది ఆ దిశగా ప్రయత్నించడం లేదు. రబీ పంట తరువాత వేసవిలో భూముల్లో దుక్కులు చేపట్టడం ద్వారా రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

లోతుగా, వాలుకు అడ్డంగా దుక్కులు

రానున్న ఖరీఫ్ పంటకు సంబంధించి ఇప్పటి నుంచే రైతులు వేసవి దుక్కులు చేపట్టాలి. కలుపు మొక్కల వేర్లు, పురుగు మందుల అవశేషాలు నేలలో ఉంటాయి. లోతు దుక్కుల ద్వారా విష పదార్థాలు విచ్ఛిన్నమై పంటల దిగుబడి పెరుగుతుంది . వ దుక్కులు లోతుగా, వాలుకు అడ్డంగా చేయాలి. ఇలా చేయడం ద్వారా వర్షాలు పడినా భూసారం బయటకు కొట్టుకుపోదు. పొలం గుల్లగా ఉండటంతో వర్షాలు కురిసే సమయంలో ఆ నీరు భూమిలో ఇంకిపోతుంది. దీంతో నేలలో తేమ శాతంతో పాటు సేంద్రియ కర్బన శాతం, పోషక పదార్థాలు పెరుగుతాయి.


గోస్పాడు సమీపంలో ట్రాక్టర్‌తో పొలాన్ని దుక్కి దున్నుతున్న రైతు

చీడపీడలకు చెక్

ఎండాకాంలో చాలావరకు భూమి ఖాళీగానే ఉంటుంది. ఈ సమయంలో గత పంటలను ఆశించిన అనేక రకాల పురుగులు వాటి నిద్రావస్థ దశలను నేల, చెత్త, చెదారం, కొయ్య కాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలగజేసే శిలీంద్రాలు భూమి లోపలి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంధ్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. వేసవి దుక్కులతో నిద్రావస్థ దశలో ఉన్న చీడపురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు బయట పడతాయి. వాటిని పక్షులు, కొంగలు ఇతర పక్షులు తిని నాశనం చేస్తాయి. లోతుగా దున్నడం వల్ల భూమి లోపలి పొరల్లో ఉన్న శిలీంధ్ర బీజాలు మట్టితోపాటు నేల పైకి వస్తాయి. బయటి అధిక ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. ఇలా వేసవి దుక్కులతో రాబోయే పంటలను ఆశించే చీడపీడలకూ చెక్ పెట్టవచ్చు.

అవగాహనతో సాగు చేపట్టాలి



ఖరీఫ్ సాగుకు ముందు రైతులు దుక్కులు దున్నుకోవాలి. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే రసాయనిక ఎరువుల వాడకం తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చు. సాగు చేసే ముందు నేల స్వభావాన్ని బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలి. నీటి సౌకర్యం తక్కువగా ఉన్న భూముల్లో అందుకు అనువుగా ఉండే పంటలను సాగు చేసుకోవాలి. వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉన్న చీడపీడలు నశిస్తాయి. దీనివల్ల పైర్లకు లాభసాటిగా ఉంటుంది.
– స్వప్నికారెడ్డి, వ్యవసాయాధికారి, గోస్పాడు

వందశాతం ఫలితాలు సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): రానున్న విద్యా సంవత్సరంలో వందశాతం ఫలితాలే లక్ష్యంగా విద్యాబోధన సాగాలని డీఈఓ జనార్ధన్‌రెడ్డి సూచించారు. ఇటీవల విడుదలైన పది పరీక్షల ఫలితాలపై నేషనల్ పీజీ కళాశాలలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మే 2025 అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, ప్రత్యేక తరగతుల నిర్వహణ, 2025–26 విద్యాసంవత్సర వార్షిక ప్రణాళిక, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ భయంతో సాధించలేనిది చిరునవ్వు, ప్రేమతో సాధించవచ్చన్నారు. రాబోయే విద్యాసంవత్సరంలో 100 శాతం అడ్మిషన్లు 100శాతం రిటెన్షన్లు, 100శాతం ఫలితాలను సాధించేటట్లు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. డిప్యూటీ డీఈఓలు శంకర్‌ప్రసాద్, వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సెలవులో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ మహబూబ్‌బేగ్ పాల్గొన్నారు.

నూతన వైద్య విధానంపై అవగాహన అవసరం

గోస్పాడు: నూతన వైద్య విధానంపై వైద్యులకు అవగాహన ఎంతో అవసరమని మెడికల్ ఎడ్యుకేషనల్ యూనిట్ చైర్మన్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. నంద్యాల పట్టణం నూనెపల్లెలోని మెడికల్ కాలేజీలో కొత్తగా సర్వీసులోకి వచ్చిన వైద్యులకు నూతన వైద్య విద్యావిధానంపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. రెండో రోజు మంగళవారం శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మెడికల్‌విద్యావిధానంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అన్ని మెడికల్ కాలేజీలలో ప్రవేశపెట్టాలన్నారు. అందులో విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు అందేలా కృషి చేయాలన్నారు. వైద్య విద్యార్థులను ప్రపంచ స్థాయి వైద్య విధానానికి దీటుగా తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.


శిక్షణకు వచ్చిన వైద్య బృందం

మెడికల్ ఎడ్యుకేషనల్ యూనిట్ కో ఆర్డినేటర్ అరుణకుమారి, రీజనల్ సెంటర్ కన్వీనర్ కిరణ్‌తో పాటు మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ మెంబర్ల ఆధ్వర్యంలో వైద్యులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైద్యులు రమేష్, నిరంజన్, జ్యోతి, కళావతి, శారదా, విజయకుమారి, అరుణ, న్యూటన్‌తో పాటు పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర


శిక్షణలో మాట్లాడుతున్న అలోక్ త్రిపాఠి

నంద్యాల(న్యూటౌన్): పిల్లల్లో దేశభక్తిని పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి అన్నారు. మంగళవారం నంద్యాల మండలంలోని శ్రీ రామకృష్ణ పీజీ కళాశాలలో శిక్షణ పరిశీలించారు. అనంతరం కాలేజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎన్‌సీసీ కేడెట్స్ క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాలన్నారు. జూన్ నెలలో కర్నూలు 9వ బెటాలియన్ బాలికల ఆధ్వర్యంలో వార్షిక ట్రెనింగ్ శిక్షణ శిబిరానికి 20రోజుల క్యాంపు, వసతి, సదుపాయాలు కల్పిస్తున్న రామకృష్ణ డిగ్రీ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు జోబీ, పిలిప్స్, సుప్రియ, ఎన్‌సీసీ ఆఫీసర్ లలితాసరస్వతి, లక్ష్మీదుర్గా, కమాల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం విధుల్లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వై.రామపక్కీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో డీఈఓ జనార్దన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80శాతంకు పైగా పాస్ అయిన పాఠశాలల ఉపాధ్యాయులకు రెమెడియల్ తరగతుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వయస్సు పైబడిన వారికి, దివ్యాంగులకు పరీక్షల విధులు, మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు జగదీష్‌బాబు, మధుసూదన్, మోహన్‌రెడ్డి, బాపూజీనాయక్ తదతరులు పాల్గొన్నారు.


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన


నంద్యాల(వ్యవసాయం): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షలో నాయకులు సుబ్బరాజు, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమ సమస్యల పట్ల సర్కారు స్పందించడం లేదన్నారు. ఇప్పటి వరకు ఎన్నో వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. నైట్ సర్వీస్ అలవెన్స్‌లు పెంచాలని, అక్రమ సస్పెన్స్‌లను ఎత్తివేసి పదోన్నతుల ప్రక్రియ మెదలు పెట్టాలని డిమాండ్ చేశారు. దీక్షలో యూనియన్ నాయకులు సీసీ రెడ్డి, నారాయణ, నరసింహులు, అబ్దుల్లా, సూర్య, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నందీశ్వరుడు, పద్మావతి, మద్దమ్మ, అరుణ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు

సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

నంద్యాల(వ్యవసాయం): నూనెపల్లె ఫ్లఓవర్ కింద రైల్వే లైన్‌లో అధికారులు వేసిన కంచెతో వివిధ పనుల మీద అటువైపు వెళ్లేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యను నంద్యాల ఎంపీ శబరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు. నూనెపల్లె వాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆ పార్టీ నాయకులు కంచె వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగాధర్, ప్రసాద్ రాజు, రామకృష్ణారెడ్డి, చల్లా మధు, నవీన్ గౌడ్, గోపి. మోహన్, సునీల్, శివ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యాళ్లూరు జాతరకు పోలీసు బందోబస్తు


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌ఐ వెంకటప్రసాద్

గోస్పాడు: రెండు రోజుల పాటు జరిగే యాళ్లూరు జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం జాతర సందర్భంగా బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. జాతర బందోబస్తు కోసం ఉన్నతాధికారులు ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలతో పాటు 30 మంది ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, 20 మంది కానిస్టేబుళ్లను నియమించినట్లు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా గ్రామంలో రెండు చోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహన దారులు గమనించి పోలీసు సిబ్బందికి సహకరించాలని తెలిపారు. అలాగే సిబ్బంది విధుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సిబ్బంది తప్పని సరిగా బందోబస్తు నిర్వహించాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా ఘర్షణలకు పాల్పడినా, అసాంఘిక కార్యక్రమాలను ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంబేడ్కర్‌పై కాంగ్రెస్ కపట ప్రేమ

నంద్యాల(వ్యవసాయం): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కాంగ్రెస్ కపట ప్రేమ చూపుతుందని, అధికారంలో ఉన్నప్పుడు ఢిల్లీలో ఆయన విగ్రహం ఏర్పాటుకు ఆరడుగుల స్థలం కేటాయించలేదని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్ నాయుడు, పోతుకుంట రమేష్ నాయుడు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అధ్యక్షతన అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జయంత్ ఫంక్షన్ హాల్‌లో మేధావులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రత్యక్ష ఎన్నికల్లో అంబేడ్కర్ ఓడిపోయేలా నాడు కమ్యూనిస్టులతో కాంగ్రెస్ చేతులు కలిపిందన్నారు. భారతీయ జనతా పార్టీ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాన్ని పార్లమెంట్ ఆవరణలో ఆవిష్కరించడమే కాక భారతరత్న ఇచ్చి గౌరవించిందన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ జయంతి వేడుకల కన్వీనర్ లింగన్న, కో-కన్వీనర్‌లు మేడం మురళీధర్, ఇంటి ఆదినారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు కొెట్టె కృష్ణమూర్తి, జాతీయ మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా, అడ్వకేట్ నందం బాబురావు, సుబ్బారెడ్డి, వెంకటరమణ, శివ కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

పెస్ట్ కంట్రోల్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీలో పనిచేస్తున్న ఉద్యోగి మహేష్ ఆత్మహత్యాయత్నం చేశారు. మూడు రోజులుగా సెలవులో ఉన్న ఆయన మంగళవారం రాత్రి ఆసుపత్రికి వచ్చి పెస్ట్ కంట్రోల్ కార్యాలయంలోని బీరువాలో ఉన్న ఎలుకల సంహారక మందును తీసుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. క్యాజువాలిటీలో అత్యవసర చికిత్స అందించిన వైద్యులు అతన్ని మెడికల్ వార్డులో అడ్మిట్ చేశారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం ఆయన్ను బుధవారం పరామర్శించారు. ఓ ఉద్యోగి వేధింపుల వల్లే తాను ఆత్మహత్యకు యత్నించినట్లు బాధితుడు అధికారులకు తెలిపినట్లు సమాచారం.

మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

గోస్పాడు: మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించి వారి ఆర్థిక స్వాలంబనకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి మెప్మా, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2025–26 ఆర్థిక సంవత్సర మహిళల వ్యవస్థాపకత కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా చేయూత నిస్తోందన్నారు. జిల్లాలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, ఫుడ్ సర్వీసెస్, రెంటల్ షాప్స్, సర్వీస్ సెక్టార్ కింద 334 యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందులో జిల్లాకు కేటాయించిన 1,747 యూనిట్లను నెలకొల్పేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్వయం సహాయ సంఘాల మహిళల ఉత్పత్తులను ఎప్పటికప్పుడు ఓఎన్డీసీ సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. నంద్యాల జిల్లా అంటే ఒక ప్రత్యేక గుర్తింపు ఉండే విధంగా ఉత్పత్తులను తయారు చేసేలా మహిళలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఓఎన్‌డీసీ సైట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు విక్రయించే 961 ఉత్పత్తులను కలెక్టర్ ఆన్‌లైన్‌లో పరిశీలించారు. సమావేశంలో మెప్మా పీడీ నాగశివలీల, పరిశ్రమల శాఖ జీఎం జవహర్ బాబు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్


రుద్రవరంలో కిషోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

దొర్నిపాడు: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో కిశోర వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంప్‌పై మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం, గ్రామైక్య సంఘం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల పట్ల జరిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. కిశోర బాలికల ఇళ్ల వద్దకు వెళ్లి వారి చదువు ఎలా ఉంది, పై చదువులకు ఇబ్బందులు ఉంటే గుర్తించి చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆడపిల్లలకు ప్రస్తుతం చదువే బంగారు భవిష్యత్ అని తల్లిదండ్రులకు సూచించాలన్నారు.

- చాగలమర్రి: గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని చాగలమర్రి ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఐసీడీఎస్ జీఎంఎస్‌కే, ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు, పొదుపులక్ష్మీ గ్రూపు సభ్యులకు సూచించారు. మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బాల్యవివాహాలు, కిశోర వికాసం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. ప్రతి బాలిక బడికి వెళ్లేలా ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

కిషోరి వికాసంపై అవగాహన సదస్సులు

రుద్రవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో బాలికలను చైతన్య పరిచేందుకు చేపట్టే క్యాంప్‌లను విజయవంతం చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం సూపర్ వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వీఓఏలు,అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ గ్రామ కమిటీ సభ్యులు మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు లైగింక్ దాడులు, బాల్యవివాహాలు, వేధింపులు తదితర వాటిపై బాలికలకు అవగాహన కలి్పంచాలని చెప్పారు. సమాజంలో నడుచుకోవాల్సిన తీరును వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఉన్నారు.

అధైర్యపడకండి..అండగా ఉంటా


కుమారి మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు

చాగలమర్రి: మద్దూరు గ్రామం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొత్తమాసి సాల్మన్ సతీమణి, పార్టీ ఎస్సీ విభాగం నాయకురాలు కొత్తమాసి కుమారి క్యాన్సర్‌తో బాధపడుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం మద్దూరు గ్రామానికి చేరుకొని కొత్తమాసి కుమారి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు.మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అధైర్యపడకండి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుమారి పార్టీలో చురుకుగా పనిచేశారని కొనియాడారు. బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, ఎంపీపీ వీరభద్రుడు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, సర్పంచ్ రేనాటి బాలీశ్వరరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు దస్తగిరి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, స్థానిక నాయకులు మాబు షరీఫ్, శివకుమార్, జమాల్‌వలి, నాగేశ్వరరావు, శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.

- రుద్రవరం: విద్యుత్ ప్రమాదంలో సోమవారం గాయపడిన మండల కేంద్రం రుద్రవరం బెస్త కాలనీకి చెందిన కేబుల్ ఆపరేటర్ జనార్దన్ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం రుద్రవరానికి చేరుకొని మృత దేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏదైనా అవసరమైతే తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు కొల్లం పుల్లయ్య, తెలుగు బాబు, నంబర్‌వన్ వుశేని, బండారు పెద్దన్న, అన్నలదాసు బాలన్న తదితరులు ఉన్నారు.